



కథానిక

తాళ్ళూరు నాగేశ్వరరావు

చిన్నకోడలు వేదవతి ఉదయమే పొయ్యిదగ్గర కూర్చుని, కాగే పాలగిన్నె దించి, కాఫీ డికాషన్‌లో పోసింది. తల్లి మెడని కావిలించుకొని, అటూఇటూ ఊగుతూ "అమ్మా! కాఫీయే!" అని తొందరచేస్తున్నాడు బాబు. పంచదార వేసి, కాఫీ స్పూన్‌తో కలియబెడుతోంది, వేదవతి. ఎర్రగన్నేరు చెట్టులోంచి ఉదయపు ఎండ ఆమె ముఖంమీద పడుతోంది. ముఖంమీద చేరుతున్న చిన్న చెమటబిందువులు ఎండకు మెరుస్తున్నాయి

ఇంట్లోవాళ్ళంతా ఆమె తయారుచేసే కాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

పందిరిక్రిందకూర్చున్న పెద్దకోడలూ అత్తయ్య సుభద్రమ్మ మటుకు కొంచం చిరాగ్గా ఉన్నారు, ఇంకా కాఫీ రాలేదేమా అని. పెద్ద మనమడు సూరిగాడు చిందులు తొక్కుతున్నాడు.

"ఏం కాఫీయో! ఏం కథో. గుక్కెడు వేడి నీళ్ళలో పంచదారవేసి కలపడానికి ఇంతసేపు!" అంటోంది సుభద్రమ్మ.

"అవును. తయారుచేసేవాళ్ళకి ఉండాలి ఆ తొందర. ఇవతల పిల్లలు ఆకలితో చస్తూంటే- పెద్ద ఆఫీసరు భార్యలాగ ఎండ ముఖంమీదకు వచ్చినప్పుడు లేవటం, దర్జాగా కాఫీగిన్నె పొయ్యి మీద ఎక్కించి పొయ్యిదగ్గర జాగారంచేయటం- ఏంబావుండలేదు" అన్నది పెద్దకోడలు.

ఆ మాటలు వేదవతి హృదయానికి బల్లాలు గ్రుచ్చుకున్నట్టు గ్రుచ్చుకున్నాయి.

తనకంటె ఆమె ఏం ఎక్కువ? ఇంట్లో రోజూ తనకంటె ఏం ఎక్కువ పనిచేస్తూంది? తనని ఎందుకు అట్లా సరిపడని మాటలు అనాలి?

తోటికోడలు అన్న మాటలు ఆమెకు విపరీతమైన కోపాన్ని తెప్పించాయి ముఖ్యంగా 'పెద్ద ఆఫీసరు భార్యా' అని ఎత్తిపొడిచిన మాట ఆమెలో అవమానం తాలూకు బాధని పెంపొందించింది. ఆ మాట చాలాసార్లు ఆమె నోటినుంచి విన్నది. విన్నప్పుడల్లా విపరీతమైన కోపానికి గురి అవుతూనే వస్తూంది.

గబగబా కాఫీ గ్లాసుల్లోకి పోసి వాళ్ళముందు పెట్టింది. ఒక గ్లాసులో పోసుకొని ఇంట్లో భర్త సూర్యారావు దగ్గరకు తీసికెళ్ళింది.

కాఫీగ్లాసు డ్రాయరుమీద పెడుతూ- "ఇంట్లో ఈ ఎత్తిపొడుపుమాటలతో ఎన్నాళ్లు బ్రతకడం?" అన్నది వేదవతి ఏవగింపుగా.

వదినె అన్న మాటలు విన్నాడు సూర్యారావు. కనుకనే రోజూఉండే తతంగమేననుకొని భార్య ఏవగింపురకు జవాబు అందుకోలేదు. కాఫీ తాగుతున్నాడు.

భర్తవంక అసహ్యంతో, కోపంతో, చూసి బయటికొచ్చింది. బాబు తల్లిపైటవెంట నడుస్తూ "అమ్మా! కాఫీయ్" అంటున్నాడు.

సుభద్రమ్మ పెద్దమనుమడికి కాఫీ పట్టుతోంది. పెద్దకోడలు కాఫీత్రాగి గ్లాసు క్రిందపెట్టింది.

"ఏం కాఫీయో! ఏమో! తాగినట్టే ఉండటం లేదు. చేదు. కాస్తంత పంచదారవేస్తే దీనిసొమ్ము ఏంపోయిందో! మేం కాఫీ తాగుతున్నామని అంత కన్ను ఎరుపు ఎందుకో!" అని రాగాలు తీసింది అత్తయ్యతో. వేదవతికి సివం ఎత్తినట్టయింది.

"అంత నోరు పారేసుకోవడం దేనికి? పంచదార ఎక్కువేస్తే- పానకమనీ, దీని సొమ్ము ఏం పోయింది, పంచదార అయిపోగొట్టుతూన్నదనీ. తక్కువేస్తే- కన్ను ఎరుపు ఎందుకనీ. ఇదీ వరస! నే కాచిన కాఫీకి వంకలుపెట్టి నామీదపడి ఏడవకపోతే- నువ్వు కాచుకోరాదూ?" వేదవతి వేను కంజవేయలేదు.

"చూడు చూడత్తయ్యా! మనం దానిమీద పడి ఏడుస్తున్నామట. ఎంతమాట? ఆ నోటికి హద్దూ ఆపూ ఏమన్నా వుందేమో చూడు. మొగుడేమన్నా బజార్లలో పచార్లు, కూవిడే మన్నా మనమీద సవాళ్ళు. బాగానే ఉంది, కాపురం!"

తన భర్తసంగతి ఎత్తేసరికి వేదవతికి వొళ్లు తెలీని కోపంవచ్చింది.

ఇక ఇద్దరూ మాటల్ని బాణాల్లాగ సూటిగా విసురుకోనారంభించారు. సుభద్రమ్మ అప్పుడప్పుడూ పెద్దకోడలువైపునే అందుకొంటూన్నది. సూర్యారావు గోల భరించలేక బయటికెళ్ళాడు. తెల్లవారుఝామున పొలం వెళ్ళిన వెంకటనరసయ్య. సూర్యారావు తండ్రి ఇంటికి వచ్చాడు కోడళ్ల తగువు సద్దుమణిగింది.

ఆ కుటుంబంలో ఇటువంటి సంఘటనలు వారానికి రెండు మూడుసార్లు జరుగుతూనే వుంటాయి. ఇంట్లో రెండు పార్టీలు. తల్లిదండ్రులు, పెద్దకొడుకూ, పెద్దకోడలూ ఒక పార్టీ. చిన్నకొడుకూ, చిన్నకోడలూ ఒక పార్టీ. రెండు పార్టీలమధ్యా తరచూ సంఘర్షణలు జరుగుతూనే ఉంటాయి.

సూర్యారావు బి. కాం. ప్యాసయ్యాడు. తగిన ఉద్యోగం దొరక్క ఇంటిదగ్గరనే ఉంటున్నాడు. పొలంపని చేయలేడు. చేతకాదు కూడాను. కనుక తల్లిదండ్రులకూ, అన్నయ్యకూ అతనిమీద అక్కసు. వేదవతి కూడా చదువుకున్నది. ఇంగ్లీషు కూడా కొంత వచ్చు. ఆమె వేషభాషల్లోనూ, చేష్టల్లోనూ నేటి నాగరికత ప్రతిబింబిస్తూ వుంటుంది. ఆమెమీద చదువూ-సంస్కారంలేని, పెద్దకోడలికి అసూయ జాస్తి. సుభద్రమ్మకు 'కారణంలేని ద్వేషం ఎక్కువ. తోడికోడలు అసూయ—అత్తయ్య ద్వేషం—రెండూ వేదవతిని బాధిస్తూ రాసాగినయ్.

సూర్యారావుకీ, అతని భార్యకూ ఆ ఇంట్లో దమ్మిడీ విలువలేదు. కాబట్టి వాళ్లు వేరే ఉందామని అనుకొని తండ్రిని సూర్యారావు అడిగాడు, భాగాలు పంచిపెట్టమని. ఆమీదట తండ్రి వెంకటనరసయ్య ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. దాని సారాంశం ఏమిటంటే: కొడుకు లిద్దరూ ఇంకా సొంతం రెక్కలురాని పక్షులు. ఇప్పుడు కనుక భాగాలు పంచిపెడితే ఆస్తిని పాడుచేస్తారు. ఇంకా కొన్నాళ్లు గడవాలి. సూర్యారావు తండ్రిని ఎదిరించలేక పోయాడు. అతని చదువుకే ఇదివరలో చాలా డబ్బు ఖర్చుచేసి ఉన్నాడు.

ఆస్తి పంచుకున్న రోజే తన కష్టాలు విరగట్టె నట్టు భావిస్తుంది వేదవతి. కాని వెంకటనరసయ్య ఇప్పట్లో కొడుకులికి భాగాలు పంచి ఇచ్చేట్టు లేడు. అందుకు సుభద్రమ్మ ప్రోద్బలం కూడా ఉంది.

ఈ విషయంలో లోకానికి తెలియని ఒక నిగూఢ రహస్యం ఉంది. అంతా కలిసిఉన్నట్లయితే, అధికారం తమ చేతుల్లోనే ఉంటుంది కనుక కూతురుకు ఎక్కువ ఆస్తి దోచిపెట్టవచ్చునని. ఈ రహస్యాన్ని మొట్టమొదట కనుకున్న వాళ్లు సూర్యారావు- వేదవతీ. పెద్దకోడలికి కూడా తెలుసుకానీ, ఆమెకు జరుగుతూన్న లోటు ఏమీలేరు కనుక తెలియనట్లే నటిస్తూంది.

ఏదో ఒక సంఘటనవల్ల కుటుంబంలో పెద్ద కలహం చెలరేగితేనైనా—తండ్రి భాగాలుపంచి ఇస్తాడేమోనని, సూర్యారావు అప్పుడప్పుడూ అనుకొంటూ వుంటాడు. కాని ఇంట్లో పోట్లాటలు ఎన్నడూ అటువంటి స్థితికి దారితీసి ఉండలేదు.

ఆ ఉదయం తొమ్మిది గంటలకు వేదవతి తమ్ముడు సెలవల్లో అక్కయ్యను చూసేందుకు వచ్చాడు. అతను పట్నంలో చదువుతున్నాడు. పట్నంనుంచి సెలవలకు ఇంటికి వస్తూవస్తూ—వేదవతి కొడుకు బాబుకి ప్రత్యేకంగా ఒక ఆటబొమ్మ కొనుక్కొని వచ్చాడు. దాన్ని వెంటే పట్టుకువచ్చాడు. వచ్చీరానీ మాటలతో "మామయ్యా?" అని పిలిచే బాబును ఒళ్లో

కూర్చోబెట్టుకొని, జేబులోంచి బొమ్మ తీసి బాబు కిచ్చాడు.

ఈ రంగురంగుల వింతైన బొమ్మ చూసి బాబు మామయ్య వొళ్లో వుండి, సంతోషంతో కూడుకున్న అమితోత్సాహంతో గంతులేశాడు.

"ఎక్కడ తెచ్చావురా? ఎంత?" అన్నది వేదవతి.

"చౌకేలే."

బాబుగాడు ఆ బొమ్మతో పట్టరాని పొంగుతో ఆడుకొంటూంటం పెద్దకోడలి కొడుకు సూరి చూశాడు గోడప్రక్కన ఎడంగానుంచుని. వెంటనే వాడు వంటగది మండిగంమీద కూర్చున్న తల్లి దగ్గరకు పరుగెత్తాడు.

"అమ్మా అమ్మా! నాకు ఆ బొమ్మ కావాలే!"

"ఏ బొమ్మరా?" విసుక్కుంది.

వేలెత్తి చూపించాడు- సూరిగాడు.

ఆమె లేచి కిటికీలోంచి తోడికోడలు కొడుకు చేతిలోఉన్న బొమ్మను చూసింది. చాలా బావుంది అనుకుంది.

"నాకు అటువంటి బొమ్మ కావాలే! ఆడుకుంటాను" బుంగమూతి పెట్టి చిందులు త్రొక్కుతున్నాడు సూరిగాడు.

పెద్దకోడలికి కోపం వచ్చింది. ఆ కోపంతో పాటు తోడికోడలుమీద అసూయకూడా ప్రజ్వరిల్లింది. సూరిగాడ్ని ఛడాఛడా కొడుతూ-

"వెధవా! చూసిన ప్రతిబొమ్మా కావాలీ. మనకెట్లావస్తాయి. మీనాన్న ఇంగ్లీషు చదివిన వాడా! మీ అమ్మ ఇంగ్లీషు చదువుకొందా!— మీ మామయ్య పట్నంలో చదువుకొంటున్నాడు! మనది మొదట్నుంచీ గొడ్లనుకాచే కుటుంబం. లేనిదర్జాలు మనకెట్లావస్తాయ్!- నోరుమూసుకొని పడిఉండు"అంటోంది.

వేదవతి ఒకప్రక్క తమ్ముడుచెప్పే యోగక్షేమాలు వింటూ- పెద్దకోడలు అసూయతో కుమిలిపోతూఅనేమాటల్ని జాగ్రత్తగావింటోంది.

సూరిగాడు బొమ్మకోసం ఏడుస్తూనే ఉన్నాడు.

చివరకు సుభద్రమ్మ ఆ బొమ్మ తెప్పించి యిస్తానని బాగానచ్చచెప్పింతరువాత సూరిగాడు ఏడుపుకు తాత్కాలికంగా వాయిదా వేశాడు.

ఆ రోజంతా వేదవతి కొడుకు ఆ రంగు రంగుల ఆటబొమ్మతో చాల హుషారుగా ఆడుకున్నాడు. వాడిసంతోషానికి వేదవతి నవ్వుకుంది.

కాని సూరిగాడు మటుకు ఆముదం మ్రింగిన ముఖంతో ఆ రోజంతా ఆ బొమ్మకేసి ఆశగా దిగులుగా చూస్తూ ఉన్నాడు. పెద్దకోడలుకళ్లల్లో సూదులుగ్రుచ్చుకుంది. ఆ బొమ్మకేసి చూసినప్పుడల్లా ఆమెకు తనకొడుక్కి అటువంటి బొమ్మ లేకపోయిందే అన్న విచారం కలిగేది.

* * *

మరునాడు ఉదయం నిద్రమంచంమీదనుంచి లేస్తూనే వేదవతికొడుకు బాబు "అమ్మా! బొమ్మ ఏదే?" అన్నాడు.

"ఉందిలే. లేబాబూ!" అని వాడ్ని మంచం మీదనుంచి లేవదీసింది వేదవతి.

కాని వాడికి బొమ్మ చూచేవరకూ మనస్సు ఆగడంలేదు. వేదవతి రాత్రి పడుకోబోతూ ఆ బొమ్మను ఇంట్లో గూటిలో పెట్టింది. ఆ బొమ్మ తెచ్చి బాబుకు ఇచ్చేందుకు ఇంట్లోకెళ్ళి గూటిలో చూసింది-బొమ్మలేదు.

ఆమెకు అర్థంకాలేదు. ఏమైంది? ఇంకా కొన్నిచోట్ల చూసింది. ఇల్లంతా వెతికింది. కాని బొమ్మ కనిపించలేదు.

ఎవరు తీశారు? వేదవతికి అనుమానం కలిగింది. కాని నిర్థారణ చేయటం ఎట్లా?

భర్తతో చెప్పింది.

సూర్యారావు శ్రద్ధగా వినలేదు.

బొమ్మ పోయిందని బాబు ఏడ్వనారంభించాడు. వేదవతికి కోపం ఎక్కువై బాబును కొట్టింది. వాడు ఏడుపు ఆరున్నర శృతిలోనికి పెంచాడు.

ఇంతలో ఆ బొమ్మతో ఆడుకొంటూ సూరిగాడు వచ్చాడు. ఆ బొమ్మని చూసి బాబు— "అమ్మా! అదుగోనే నా బొమ్మా!"అని వేలెత్తి చూపించాడు.

వేదవతికి అర్థమైంది. వాడిచేతిలోకి ఎట్లా వొచ్చింది?

పెద్దకోడలు సూరిగాడిని పిలిచి ఇవతలికి రప్పించింది.

బాబు ఏడుపును అభివృద్ధిచేశాడు.

వేదవతికి రెండువిధాల కోపం పెరిగిపోయి వాడిని మళ్ళీ కొట్ట నారంభించింది.

"నీకు బొమ్మ కావాలీ! నీ బొమ్మని ఎవరో దోపిడీ దొంగలు ఎత్తుకెళ్ళారు ఏడుస్తూ ఏడిస్తే ఎట్లా వస్తుంది? దొంగిలించేవాళ్ళకు బుద్ధీ, జ్ఞానం ఉండాలి. పిల్లలి వస్తువు దొంగిలించడానికి వాళ్లకు చేతులు ఎట్లా వచ్చినాయంటా, వాళ్ళ చేతులు విరిగిపోనూ? నాకంటికి కనబడితే చేతులమీద వాతవేద్దును. పుట్టగానే సరిగాదు. ఏళ్లునిండగానే సరిగాదు. వెధవ ఆటబొమ్మకోసమే పొల్పడటం. చీమూ నెత్తురూ ఉన్నవాళ్లు ఆపని చేయరు"అని తిడుతోంది వేదవతి బొమ్మ తీసికెళ్ళినవాళ్ళని దృష్టిలో పెట్టుకొని.

ఆ మాటలనన్నిటినీ విన్నది పెద్దకోదలు వంట ఇంట్లో ఉండి. ఆమె భర్త వెంకటనారాయణ, వెంకటనరసయ్యా పొలాన ఉన్నారు. ఆ మాటలు వేదవతి తననే అంటూన్నట్టు తెలియవచ్చింది. ఆమె తోకతొక్కిన త్రాచులాగ లేచింది.

"అది ఆ వరసన తిడుతోంది. ఇంట్లో వాళ్ళ నందర్నీ దోపిడీ దొంగలక్రింద కట్టింది. మా చేతులు విరిగిపోవాలట. ఆ మాటలు అన్న దాని నోరే పడిపోవాలి. మాకు చీమూ నెత్తురూ లేదట. దానికి ఉ న్నా యి గా వు ను. మాడు అత్తయ్యా! అది ఎంతగా పేలిపోతుందో! దాని కొడుకు బొమ్మని మనం దొంగిలించామట. మన మీద ఆడిపోసుకొంటూన్నది. నిన్ననేగా మీ పెద్దకొడుకు తెనాలి వెళ్ళి ఆ బొమ్మ తెచ్చి యిచ్చింది. పిల్లవాడు ఏడుస్తున్నాడని బొమ్మ కొనుక్కొంటే అది వీళ్ళదా! ఇక లోకంలో అటువంటి బొమ్మలు ఉండవా?"

వేదవతి అందుకున్నది.

"మీరు బయటపడి నన్ను తిడుతున్నారుగానీ మీ పేర్లెత్తి నేను తిట్టలేదు. మీ భుజాలు మీరే తడుముకొంటున్నారు."

సుభద్రమ్మకూడా పాల్గొన్నది. పెద్ద కోడలిని వెనక వేసుకువచ్చింది.

"ఒసేవ్, మాటలు అనగానే సరిగాదు. నీ మనస్సులో ఉన్నదంతా కుళ్ళే. ఏదో ఒకదాని మీద వంకబెట్టి మమ్మల్ని తిట్టటమే నీ బతుకు. కాకపోతే ఆ బొమ్మని మేము దొంగిలించి ఆ పిల్లవాడికిచ్చామా? నిన్ననేగా మా పెద్దవాడి చేత ఆ బొమ్మని తెప్పించింది అటువంటి దొంగ బుద్ధి మా వంశంలోనే లేదు. ఇన్నాళ్ళకుగాను నీవు వచ్చి మమ్మల్ని దొంగలక్రింద కడుతున్నావు గాని మహాతల్లీ!"

వెంకటనరసయ్య వచ్చాడు పొలాన్నుంచి. భార్యఅంటూన్న మాటలు విన్నాడు.

"ఏమిటి అంటున్నావు? మళ్ళీ ఏదోయుద్ధం చెలరేగినట్లుందే!"

"ఏముంది—మన ఇల్లే ఒక యుద్ధభూమి. నిన్న అబ్బాయిచేత తెప్పించిన బొమ్మకి—అది తన కొడుకుబొమ్మని దొంగిలించారు మీరంతా కట్టుగాగూడి అని శాపనార్థాలు పెడుతోంది చూశారా! దానితల బిరుసుతనం. ఆ బొమ్మని ఏ ఎలికలో, పిట్టలో ఎత్తుకెళ్ళి ఉంటాయి. ఇక మనల్ని అనరానిమాటలు అంటూన్నది."

వెంకటనరసయ్య చిన్నకోడల్ని అసహ్యించుకున్నాడు. ఇరుగింటివాళ్ళూ పొరుగింటివాళ్ళూ అప్పటికే ఏడెనిమిదిమంది చేరారు.

"నీవల్ల మా కుటుంబం నవ్వులపాలుకావాల్సి వస్తూంది. మాటిమాటికీ పోట్లాటలు. ఆ బొమ్మ మావాడిచేత కుర్రవాడు ఏడుస్తున్నాడని నేనే తెప్పించింది. దానికి నువ్వు అందరిమీదా దొంగతనాలుకట్టి పెద్దరాద్ధాంతం చేస్తున్నావు. నీకింద మేముబ్రతికేటట్టులే!"అన్నాడు వెంకటనరసయ్య.

అత్తమామలు పెద్దకోడలిని వెనక వేసుకు రావడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

చావడి దగ్గర్నుంచివచ్చిన జీతగాడు పోట్లాట సావకాశంగా విన్నాడు. అందరూ వింటూండగా వాడు అన్నాడు.

"ఆ బొమ్మను దొంగిలించింది నేనండీ! అమ్మగారూ! సుభద్రమ్మగారు గూట్లోఉన్న బొమ్మను ఎవ్వరూ చూడకుండా నన్ను తీసుకురమ్మన్నారు. తీసుకొచ్చి ఇచ్చాను. ఎవ్వరితో చెప్పవద్దన్నారు. ఇంతగోల జరుగుతుందని నాకుతెలియదు."

జీతగాడి తీర్పుకి పెద్దకోడలూ సుభద్రమ్మా, వెంకటనరసయ్యా దిగాలుపడి నిలబడ్డారు. ఇరుగు పొరుగు వాళ్లు వేదవతిపట్ల సానుభూతి చూపించారు. వాళ్ళ సానుభూతిమాటలు అత్తమామల్ని మరీ అవమానపరిచాయి.

అందులో ఒక ముసలావిడ—

"పెద్దవాడు. వెంకటునరసయ్య కూడా అబద్ధ మాటేడే! ఇంట్లో అంతా ఒకటి-పాపం వేదవతి ఒకటి" అన్నది.

ఆ మాటలకు వెంకటునరసయ్యకి తల తిరిగి పోయింది. పెద్ద అవమానాన్ని పొందినట్టు భావించాడు. ఆయనకు అంత అవమానంలోనూ విపరీతమైన కోపం వచ్చింది.

"రోజూ ఇంట్లో ఈ వెధవ గోలెందుకు? బయటవాళ్ళ పంచాయితీ ఎందుకు? అందుచేతా నేను మాటలుపడడం దేనికి? నేను తింటున్నానని నామీద పడి ఏడ్వటం దేనికి?—ఎవరి భాగాలు వాళ్ళకి పంచియిస్తాను. వాళ్ళ బ్రతుకులు వాళ్ళే చూసుకుంటారు" అన్నాడు వెంకటు నరసయ్య.

పెద్దకోడలు,సుభద్రమ్మా దిగాలుపడిచూశారు.

వేదవతి సంతోషించింది

ఇరుగుపొరుగువాళ్లు ముసలివాడి తెగింపునకు ఆశ్చర్యపడ్డారు.

* * *

ఆయిదుగురు పెద్దమనుష్యుల మధ్య భాగాలు సమంగానే పంచాడు వెంకటునరసయ్య. తానూ ఒక భాగం తీసుకున్నాడు. ఇంటి భాగం పెద్ద కొడుకుకూ తలిదండ్రులకూ పోయింది. సూర్యారావుకు రోడ్లో ఇల్లుకట్టుకునేట్టు వచ్చింది.

కాని సూర్యారావుకి ఉద్యోగం వచ్చింది, ఒక బ్యాంకులో.

ఆ ఊరినుంచి కాపురాన్ని బస్తీకి మార్చాడు సూర్యారావు.

వేదవతికి నరకలోకంనుంచి స్వర్గలోకంలోకి వూడిపడినట్టు అనిపించింది.

ఆ సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ సూర్యారావు బాబుకి బొమ్మలు కొనుక్కొనివచ్చాడు. ఆ బొమ్మల్లో విశేష ప్రతిభగల ఒక బొమ్మ బాబుకి ఇచ్చాడు సూర్యారావు.

"ఎట్లా ఉందిరా బొమ్మ?"

వాడు కనుక్కున్నాడు.

"మామయ్య తెత్తిన బొమ్మ" అన్నాడు వాడు పరమ సంతోషంతో.

"అటువంటి బొమ్మే మనల్ని కష్టాల్నుంచి తప్పించింది" అన్నది వేదవతి భర్తవంక చూస్తూ.

సూర్యారావు "అవును" అన్నట్టు భార్యవంక చూశాడు, నవ్వుతూ.

బాబు ఆ ఆట బొమ్మను హృదయానికి గట్టిగా అదుముకున్నాడు, ముద్దుగా.

---

"స్వభావముచేతనే యర్థరహితములు, వ్యర్థములునైన విషయములను గురించి జరుపు పాత చర్చలకు వాగ్వివాదములకు స్వస్తి చెప్పుడు. గత ఆరేడు వందల సంవత్సరములనుండి మనమొకవంక యవినీతి పాలగుచు కుడిచేతితో నీరుత్రాగవలెనా? ఎడమ చేతితోనా? చేయి మూడుసారులు కడుగుకొనవలెనా లేక నాల్గు సారులు కడుగుకొనవలెనా? మన మయిదు సార్లు పుక్కిలించవలెనా? లేక నాల్గుసార్లు పుక్కిలించవలెనా యని సంవత్సరముల తరబడి తర్కించుచు నిట్టి 'గొప్ప ప్రశ్నల'తో జీవితములను గడపువారి నుండి మన మేమియాశింపగలము? పైగా వీనిమీద నిశిత వేదాంత గ్రంథములు వ్రాయుట! మన మతముకు పాకశాల నాశ్రయించిన యుపద్రవము గూడ సంభవించెను. మనలో చాలమంది యిపుడు వేదాంతులమూ కాము! పౌరాణికులమూ కాము! తాంత్రికులమూ కాము! మనము కేవలము "నన్ను ముట్టుకోకు" యను తంతులోనికి దిగితిమి." అని వివేకానందు డెలుగెత్తి చాటినాడు. మనలో వివేకము నశించినది. ఏది ముఖ్యము? ఏది యముఖ్యము? ఏది ముందు? ఏది వెనుక? యను విచారము శూన్య మయ్యెను. వివేకమే, సారాసార పరిశీలనయే జీవిత పరిమళమును సాధింపగల దివ్యౌషధము.

—(ముదిగంటి జగన్నశాస్త్రిగారి "సంతోషము" నుండి.)